

RNI: APTEL/2010/36742

న్యూస్ వార్ వార్తా పత్రిక

విలేకరులు కావలెను
తెలుగు భాషపై పట్టు స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన ఉత్సాహవంతులైన
యువతి యువకులకు జర్నలిస్టుగా పనిచేసేందుకు సదావకాశం
న్యూస్ వార్ దిన పత్రిక
నూతన ఒరవడి ప్రత్యేక కథనాలతో మీ ముందుకు వస్తున్న న్యూస్‌వార్ దిన పత్రికలో
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు,నియోజకవర్గాలు, మండల కేంద్రాలల్లో
వార్తాసేకరణకు విలేకరులు కావలెను ఆసక్తి కలవారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించండి.
94409 91979

నల్లగొండ | epaper.news war.com | శనివారం 6, జూన్ 2026 | సంపుటి :16 సంచిక :67 | ఎడిటర్: కృష్ణారావు నటవ | పేజీలు : 4 , వెల.2.00

## లోక్‌సభకు మమతా బెనర్జీ ..

2 లో..

### బహరాంపుర్ నుంచి పోటీకి యోచన



తృణమూల్ కాంగ్రెస్ కు లోక్‌సభలోనూ అసమ్మతి పెరుగుతున్న సంకేతాలు వెలువడుతుండటంపై ఆ పార్టీ సుప్రీం మమతా బెనర్జీ పార్లమెంటు దిగువ సభకు పోటీ చేసే ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది. ఇటీవల జరిగిన పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలో టీఎంసీ ఓటమి పాలై అధికారం కోల్పోయింది. 80 సీట్లు గెలుచుకుని ప్రతి పక్షానికే పరమితమైంది. ఈ నేపథ్యంలో లోక్ సభకు పోటీ చేసే ఆలోచనలో మమతాబెనర్జీ ఉన్నట్టు పార్టీ వర్గాల సమాచారం.

## ఎస్‌యూ-57 యుద్ధ విమాన తయారుకు తాము సిద్ధమే



- ఈ విషయంలో ఎలాంటి పరిమితులు, సమస్యలు లేవు
- గగతనల రక్షణ వ్యవస్థలకూ ఇది వర్తిస్తుంది
- సహకరించే విషయంలో తాము ఎలాంటి పరిమితులు పెట్టుకోం
- భారత్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ కీలక ఆఫర్

2 లో..

ఐదో తరం ఫైటర్ జెట్స్‌ను సమకూర్చుకునేందుకు భారత్ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్‌యూ-57 యుద్ధ విమానాన్ని భారత్‌తో కలిసి సయుక్తంగా తయారు చేసేందుకు తాము సిద్ధమేనని అన్నారు. ఈ ఫైటర్ జెట్‌కు సంబంధించి కీలక సాంకేతికతలను కూడా భారత్‌కు బదిలీ చేస్తామని పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మీడియాతో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. చైనా తయారు చేసిన ఐదో తరం యుద్ధ విమానం జే-35 ఏఈని పాక్ కొనుగోలు చేయనుందన్న వార్తలు ఇప్పటికే రక్షణ వర్గాల్లో ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యం పుతిన్ ఆఫర్‌కు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. ప్రస్తుతం భారత్ వద్ద 5వ తరం యుద్ధ విమానాలు లేవు. అయితే, మధ్యశ్రేణి 5వ తరం యుద్ధ విమానం అభివృద్ధికి భారత్ ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించింది.

### క్రాకోచ్ జనతా పార్టీ తలపెట్టిన

## నిరసనపై పిల్.. తక్షణ విచారణకు ఢిల్లీ హైకోర్టు నో

2



దేశరాజధాని న్యూఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన నిరసన కార్యక్రమం అదుపు తప్పకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలంటూ ఢిల్లీ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. అయితే, ఈ పిటిషన్‌పై తక్షణ విచారణకు హైకోర్టు నిరాకరించింది. జూన్ 6న కాక్రోచ్ జనతా పార్టీ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సేవ్ ఇండియా ఫౌండేషన్ అనే సంస్థ ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలు చేసింది.



## గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ ఆన్‌లైన్ క్యాంపెయిన్

2

అండమాన్, నికోబార్ దీవులలోని గ్రేట్ నికోబార్ దీవిని ఒక వ్యూహాత్మక, ఆర్థిక, పర్యాటక కేంద్రంగా మార్చడం కోసం భారత ప్రభుత్వం 'గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్' చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ ద్వారా అంతర్జాతీయ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ టెర్మినల్, గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం, విద్యుత్ ఉత్పాదన కేంద్రం, టౌన్‌షిప్ నిర్మాణం జరగనుంది.



2

## కొత్త పార్టీ ప్రకటించిన అన్నామలై.. వచ్చే ఎన్నికల్లో పోటీకి సై..

మాజీ ఐపీఎస్ అధికారి అన్నామలై కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. కొత్త రాజకీయ ఉద్యమం చేయబోతున్నట్లు అన్నామలై తెలిపారు. భారతీయుడిగా, తమిళుడిగా గర్విస్తున్నానని, తన ఆలోచనలకు అనుగుణంగా ముందుకెళ్తానని స్పష్టం చేశారు. తమిళనాడు అభివృద్ధే తన ప్రథమ ప్రాధాన్యమన్నారు.

### తెలంగాణ అభివృద్ధికి

2

## 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరం



తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో రాంచందర్‌రావు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు.



2

## మైత్రీవనం అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్

## పాలన చేతకాకపోతే రాజీనామా చేయాలి: ఎంపీ ధర్మపురి అరవింద్



2

పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్.. సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు.ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అన్నారు.

### భవిష్యత్తులో వర్షాలు వచ్చే పరిస్థితి

## లేదు.. నీటిని ఆదా చేయండి

2



## రిటైర్డ్ ప్రొఫెసర్ ఇంట్లో చోరీ కేసు.. పోలీసుల అదుపులో నేపాలీ గ్యాంగ్

**హైదరాబాద్,**

: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మల్కాజిగిరి చోరీ కేసులో నేపాలీ గ్యాంగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత నెలలో(మే నెల) మల్కాజిగిరి పరిధిలోని రిటైర్డ్ ప్రొఫెసర్ నివాసంలో నేపాలీ ముఠా భారీ చోరీకి తెగబడింది. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరు కీలక సూత్రధారులను పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా మరో నలుగురిని పుణేలో అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఆరుగురు సభ్యులు పోలీసు కస్టడీలో ఉన్నారు. వీరిని ప్రస్తుతం పుణె నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు మల్కాజిగిరి పోలీసులు తెలిపారు.

# ఎస్‌యూ-57 యుద్ధ విమాన తయారుకు తాము సిద్ధమే

## ఈ విషయంలో ఎలాంటి పరిమితులు, సమస్యలు లేవు

## గగతనల రక్షణ వ్యవస్థలకూ ఇది వర్తిస్తుంది

## సహకరించే విషయంలో తాము ఎలాంటి పరిమితులు పెట్టుకోం

## భారత్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ కీలక ఆఫర్

ఇంటర్నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

ఐదో తరం ఫైటర్ జెట్స్‌ను సమకూర్చుకునేందుకు భారత్ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్‌యూ-57 యుద్ధ విమానాన్ని భారత్‌తో కలిసి సయుక్తంగా తయారు చేసేందుకు తాము సిద్ధమేనని అన్నారు. ఈ ఫైటర్ జెట్‌కు సంబంధించి కీలక సాంకేతికతలను కూడా భారత్‌కు బదిలీ చేస్తామని పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మీడియాతో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. చైనా తయారు చేసిన ఐదో తరం యుద్ధ విమానం జే-35ఏఈని పాక్ కొనుగోలు చేయనుందన్న వార్తలు ఇప్పటికే రక్షణ వర్గాల్లో ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యం పుతిన్ ఆఫర్‌కు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. ప్రస్తుతం భారత్ వద్ద 5వ తరం యుద్ధ విమానాలు లేవు. అయితే, మధ్యశ్రేణి 5వ తరం యుద్ధ విమానం అభివృద్ధికి భారత్ ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించింది. 2035 నాటికి ఇది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈలోపు తక్షణ అవసరాల కోసం మరో ఫైటర్ జెట్ కోసం భారత్ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు పుతిన్ ప్రతిపాదనకు ప్రాధాన్యం ఏర్పడింది. 'భారత్‌కు ఈ ఫైటర్ జెట్‌ను సరఫరా చేసేందుకు మేము సిద్ధంగానే ఉన్నాము. ఈ విషయంలో ఎలాంటి పరిమితులు, సమస్యలు లేవు. గగతనల రక్షణ వ్యవస్థలకూ ఇది వర్తిస్తుంది. వాస్తవానికి గతంలోనే ఈ విమానాన్ని సంయుక్తంగా అభివృద్ధి



చేద్దామని మేము ప్రతిపాదించాము. కానీ ఈ ప్రాజెక్టులో మేము తరువాత చేరుతామని భారత్ చెప్పింది. మేము ఇప్పుడు దీన్ని సొంతంగానే నిర్మించుకున్నాము. అయితే, భారత్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధంగానే ఉన్నాము' అని పుతిన్ చెప్పారు. రక్షణ రంగంలో భారత్‌కు సహకరించే విషయంలో తాము ఎలాంటి పరిమితులు పెట్టుకోమని స్పష్టం చేశారు. పాశ్చాత్య దేశాల నుంచి భారత్ అత్యాధునిక విమానాలు దిగుమతి చేసుకున్నప్పటికీ సాంకేతికత, కీలక సాఫ్ట్‌వేర్ బదిలీకి సంబంధించి చిక్కులు ఎదురవుతున్నాయి. ఇక ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్ ఎస్‌యూ-57 విమానాల కొనుగోలుకు సిద్ధమైందని అప్పట్లో వార్తలు వెలువడ్డాయి. శత్రుదేశ రాడాలర్లకు చిక్కకుండా ఉండేందుకు స్టెల్త్ టెక్నాలజీ, అత్యాధునిక ఏవియానిక్స్, అసాధారణ మెనూవరబిలిటీ ఉన్న ఎస్‌యూ-57ని బహుళార్థసాధక ఫైటర్ జెట్‌గా రష్యా అభివృద్ధి చేసింది. భూతల దాడులు, సముద్రదాడులతో పాటు గగనతలంలోని లక్ష్యాలను ఛేదించేలా ఈ ఫైటర్‌జెట్‌ను డిజైన్ చేసింది. అయితే, తమ అవసరాలకు ఇది తగినది కాదని భారత వర్గాలు అప్పట్లో భావించాయి. ముఖ్యంగా విమానం స్టెల్త్ సామర్థ్యాలపై భారత్ పూర్తి స్థాయిలో సంతృప్తి చెందలేదని మీడియాలో కథనాలు వెలువడ్డాయి. సాంకేతికత బదిలీకి సంబంధించి కూడా అభిప్రాయభేదాలు ఉన్నట్టు తెలిసింది. ప్రస్తుతం ప్రపంచంలో అమెరికాకు చెందిన ఎఫ్-35, చైనాకు చెందిన జే-35తో పాటు ఎస్‌యూ-57 విమానాలే 5వ తరం ఫైటర్ జెట్స్‌గా గుర్తింపు పొందాయి. ఇక తమ ఎఫ్-35 విమానాలను అమెరికా కూడా భారత్‌కు ఆఫర్ చేస్తోంది. దీంతో, భారత్ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# లోక్‌సభకు మమతా బెనర్జీ ..

## బహరాంపుర్ నుంచి పోటీకి యోచన

కోల్‌కతా: న్యూస్‌వార్ ప్రతినిధి

తృణమూల్ కాంగ్రెస్ కు లోక్‌సభలోనూ అసమ్మతి పెరుగుతున్న సంకేతాలు వెలువడుతుండటంపై ఆ పార్టీ సుప్రీం మమతా బెనర్జీ పార్లమెంటు దిగువ సభకు పోటీ చేసే ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది. ఇటీవల జరిగిన పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలో టీఎంసీ ఓటమి పాలై అధికారం కోల్పోయింది. 80 సీట్లు గెలుచుకుని ప్రతిపక్షానికే పరమితమైంది. ఈ నేపథ్యంలో లోక్‌సభకు పోటీ చేసే ఆలోచనలో మమతాబెనర్జీ ఉన్నట్టు పార్టీ వర్గాల సమాచారం. బహరాంపుర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి మమతా బెనర్జీ పోటీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ నియోజకవర్గానికి ప్రస్తుతం టీఎంసీ ఎంపీ యూసఫ్ పఠాన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారురు. ఆయనను రాజీనామా చేసి మమత పోటీకి మార్గం సుగమం చేయాలని కోరనున్నట్టు తెలుస్తోంది. 2011 ప్రపంచ కప్ విన్నింగ్ స్క్వాడ్‌లో ఒకరైన భారత మాజీ క్రికెటర్ పఠాన్ 2024 పార్లమెంటు ఎన్నికల్లో బహరాంపుర్ నుంచి గెలిచారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత అధీర్ రంజన్ చౌదరిపై 85,000 ఓట్ల ఆధిక్యంతో పఠాన్ గెలుపొందారు.

### ఆరుసార్లు ఎంపీ

మమతా బెనర్జీ గతంలోనూ లోక్‌సభ సభ్యురాలిగా ఉన్నారు. కోల్‌కతా సౌత్ నుంచి ఆరుసార్లు ఎంపీగా గెలిచారు. అయితే తొలి ఎన్నిక మాత్రం జాదవ్‌పుర్ నియోజకవర్గం నుంచి సీపీఐ అగ్రనేత సోమనాథ్ ఛటర్జీపై పోటీ చేసి గెలుపొందారు. 2011లో బెంగాల్ అసెంబ్లీకి వెళ్లేంతవరకూ లోక్‌సభ సభ్యురాలిగానే ఆమె ఉన్నారు. ఆ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఘనవిజయం సాధించింది. కాగా, ఇటీవల కాలంలో పార్టీ నాయకత్వం పనితీరుపై లోక్‌సభ టీఎంసీ సీనియర్ ఎంపీల్లో అసమ్మతి తలెత్తెది. కొందరు పార్టీ వీడే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. మమతకు సన్నిహితురాలిగా పేరున్న పార్టీ సీనియర్ ఎంపీ కాకోలి ఘోష్ దస్తిదార్ బహిరంగంగానే ఇటీవల తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. బరాసత్ నుంచి నాలుగు సార్లు ఎంపీగా ఉన్న ఆమె లోక్‌సభలో తనపై అనుచితంగా మాట్లాడుతున్నారంటూ టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీపై లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు ఫిర్యాదు చేశారు. పార్టీ పనితీరును ప్రశ్నించిన సీనియర్ ఎంపీల్లో సుఖేందు శేఖర్ రాయ్, శాంతను సేన్ సైతం ఉన్నారు.

### అసెంబ్లీలోనూ రెబల్స్ బెడద

ఇప్పటికే పశ్చిమబెంగాల్ అసెంబ్లీలో తిరుగుబాటును టీఎంసీ ఎదుర్కొంటోంది. టీఎంసీ బహిష్కృత నేత రితబ్రత బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా పార్టీకి చెందిన 57 మంది ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. స్పీకర్ రతీంద్ర బోస్ కూడా ఈ నియామకాన్ని గుర్తించారు. ఈ క్రమంలో ముందుగా లోక్‌సభలో అసమ్మతికి కళ్లెం వేసేందుకు దిగువ సభలో అడుగుపెట్టాలనే ఆలోచనలో మమతా బెనర్జీ ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# క్రాకోచ్ జనతా పార్టీ తలపెట్టిన నిరసనపై పిల్.. తక్షణ విచారణకు ఢిల్లీ హైకోర్టు నో

ఇంటర్నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

దేశరాజధాని న్యూఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన నిరసన కార్యక్రమం అదుపు తప్పకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలంటూ ఢిల్లీ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. అయితే, ఈ పిటిషన్‌పై తక్షణ విచారణకు హైకోర్టు నిరాకరించింది. జూన్ 6న కాక్రోచ్ జనతా పార్టీ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సేవ్ ఇండియా ఫౌండేషన్ అనే సంస్థ ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలు చేసింది. కాక్రోచ్ జనతా పార్టీ నిరసన కార్యక్రమం నేపథ్యంలో పబ్లిక్ ఆర్డర్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఢిల్లీ పోలీసులు చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలంటూ సేవ్ ఇండియా ఫౌండేషన్ ఈ పిల్‌ను దాఖలు చేసింది. ఈ మేరకు పోలీసులకు మార్గదర్శకాలు జారీ చేయాలని ఢిల్లీ హైకోర్టును అభ్యర్థించింది. ప్రజల మౌలికవసతుల నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదని చెప్పింది. నిరసన చేపట్టేందుకు కాక్రోచ్ జనతా పార్టీ భారీ ఎత్తున ఆన్‌లైన్‌లో ప్రచారం చేస్తోందని సంస్థ తన పిటిషన్‌లో పేర్కొంది. భారీ ఎత్తున యువత పాల్గొనేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పింది. ఈ దిశగా ఆన్‌లైన్‌లో ప్రచారంలో ఉన్న కంటెంట్‌లో రెచ్చగొట్టే సందేశాలు ఉన్నాయని తెలిపింది. భద్రతా దళాలను అడ్డుకోవడం వంటి సందేశాలు కూడా ఉన్నాయని వెల్లడించింది. భారీ ఎత్తున జనాలు హాజరు కావాలని కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో పరిస్థితి అదుపు తప్పకుండా ముందస్తు చర్యలు అవసరమని పేర్కొంది. ట్రాఫిక్, ప్రజాభద్రతకు ఇబ్బంది లేకుండా ఢిల్లీలో ఏర్పాట్లు చేయాలని చెప్పింది. ఈ విషయాలపై ఇప్పటికే ఢిల్లీ పోలీసు కమిషనర్‌ను సంప్రదించినా ఇప్పటివరకూ ఎలాంటి మార్గదర్శకాలు జారీ కాలేదని తెలిపింది. చివరకు కోర్టును ఆశ్రయించినట్టు తెలిపింది. అయితే, న్యాయస్థానం మాత్రం ఈ పిటిషన్‌పై తక్షణ విచారణకు నిరాకరించింది.

# కొత్త పార్టీ ప్రకటించిన అన్నామలై.. వచ్చే ఎన్నికల్లో పోటీకి సై..

చెన్నై, న్యూస్‌వార్ ప్రతినిధి



మాజీ ఐపీఎస్ అధికారి అన్నామలై కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. కొత్త రాజకీయ ఉద్యమం చేయబోతున్నట్లు అన్నామలై తెలిపారు. భారతీయుడిగా, తమిళుడిగా గర్విస్తున్నానని, తన ఆలోచనలకు అనుగుణంగా ముందుకెళ్తానని స్పష్టం చేశారు. తమిళనాడు అభివృద్ధే తన ప్రథమ ప్రాధాన్యమన్నారు. అన్నామలై శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మార్పు కోసమే బీజేపీలో చేరానన్నారు. రాజీనామా ఆమోదించిన బీజేపీ హైకమాండ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని అన్నారు.

### రాజీనామా గురించి ముందే చెప్పా..

అన్నామలై తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'తమిళనాడులో బీజేపీ ఒంటిరిగా పోటీ చేయాలని ఆశించా. 18 నెలలుగా బీజేపీతో విభేదాలు ఉన్నాయి. బీజేపీకి నేను భారంగా ఉండాలనుకోవడం లేదు. అందుకే బీజేపీకి రాజీనామా చేశా. 2025 డిసెంబర్ నెలలోనే అధిష్ఠానానికి రాజీనామా గురించి చెప్పా. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యే వరకు పార్టీలో ఉన్నా' అని అన్నారు.

### కొత్త పార్టీ అవసరమే..

ఆయన మాట్లాడుతూ.. 'ఈ సమయంలో తమిళనాడుకు కొత్త పార్టీ అవసరమా అని అడిగితే.. కచ్చితంగా అవసరమే. ఓ షాపునకు వెళ్లి టూత్‌పేస్టో.. బియ్యమో.. కందిపప్పో కొంటున్నపుడు పది షాపులు తిరుగుతాము. రేటు, నాణ్యత చెక్ చేసి కొంటాం. ఎందుకంటే అవి మన శరీరంలోకి పోయేవి. ఇప్పుడు ఎన్ని పార్టీలు ఉన్నా కూడా పార్టీ నాయకుడు ఎలాంటి వాడో ప్రజలు చూస్తారు. పక్కంటి వాళ్లను చూసినట్లే ప్రజలు మమ్మల్ని చూడబోతున్నారు. దూరం నుంచి ప్రజలకు అభివాదం చేసే రాజకీయాలకు మేము దూరం. కల్ట్ పాలిటిక్స్ నుంచి బయటకు రావాలి. రాజకీయాలను మారుస్తాం అంటున్నారు.. మళ్లీ అదే కల్ట్ పాలిటిక్స్ చేస్తున్నారు. కామన్ మ్యాన్ పాలిటిక్స్ ముందుకు తీసుకురావాలనుకుంటున్నా. కేవలం ముఖ్యమంత్రి కారణంగా మార్పు సాధ్యం కాదు. సర్పంచ్ దగ్గరి నుంచి ముఖ్యమంత్రి వరకు అందరూ నిబద్ధత కలిగిన వాళ్లు ఉంటేనే మార్పు సాధ్యం అవుతుంది' అని అన్నారు.

# గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ ఆన్‌లైన్ క్యాంపెయిన్

న్యూఢిల్లీ, న్యూస్‌వార్ ప్రతినిధి

అండమాన్, నికోబార్ దీవులలోని గ్రేట్ నికోబార్ దీవిని ఒక వ్యూహాత్మక, ఆర్థిక, పర్యాటక కేంద్రంగా మార్చడం కోసం భారత ప్రభుత్వం 'గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్' చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ ద్వారా అంతర్జాతీయ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ టెర్మినల్, గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం, విద్యుత్ ఉత్పాదన కేంద్రం, టౌన్‌షిప్ నిర్మాణం జరగనుంది. 'గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్' కోసం కేంద్ర ప్రభుత్వం దాదాపు 80 వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రాజెక్ట్ కారణంగా అక్కడి పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటుందని ప్రతిపక్షాలు అంటున్నాయి. 'గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్'కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ ఆన్‌లైన్ క్యాంపెయిన్ చేపట్టారు. కేంద్రానికి వ్యతిరేకంగా చ+తీవవఅూజవతీ+తీవవవ, చచీఅశీఎుతీవీఛ్‌వతీం హ్యాష్‌ట్యాగ్స్‌తో.. దేశవ్యాప్త సంతకాల సేకరణ ఉద్యమానికి పిలుపునిచ్చారు. ప్రాజెక్ట్ కారణంగా నికోబార్ దీవుల్లో స్కూబా డైవింగ్‌తో పగడపు దిబ్బలను విధ్వంసం చేస్తున్నారంటూ రాహుల్‌గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు.

# తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరం: రాంచందర్‌రావు

మహబూబాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో రాంచందర్‌రావు పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో నిధులు, నియామకాలు, సాగునీటి వ్యవస్థల్లో వైఫల్యాలు జరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. అవినీతి, నిర్లక్ష్యంతో పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ హామీ పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరమని వెల్లడించారు. 2014 తర్వాత దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతోందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతతో పాటు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలన్నారు. శిక్షణా తరగతుల్లో చర్చించిన 12 అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని నేతలకు రాంచందర్‌రావు సూచించారు.

# మైత్రీవనం అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్,

మైత్రీవనం అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈరోజు(శుక్రవారం) పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హర్ష మెస్‌ను కూడా రంగనాథ్ పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మైత్రీవనం సమీపంలో ఉన్న కేఎస్ఆర్ భవనానికి అనుమతులు ఉన్నాయా లేదా పరిశీలిస్తామన్నారు. నాలాను ఆక్రమించి భవనం కన్‌స్ట్రక్షన్ జరిగితే కచ్చితంగా కూలగొడతామని స్పష్టం చేశారు. కేఎస్ఆర్ భవనం షాప్స్ పక్కనే ఉన్న హర్ష డీలక్స్ మెస్‌ను కూడా పరిశీలించామన్నారు. అగ్నిప్రమాదంపై పోలీసుల విచారణ జరుగుతోందని తెలిపారు. హర్ష మెస్ డీలక్స్‌లో స్పార్క్ వల్ల ప్రమాదం జరిగిందా?.. షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలుతుందని రంగనాథ్ వెల్లడించారు. నాంపల్లి బిల్డింగ్ అగ్నిప్రమాదం అనంతరం ఎన్‌ఓసీలు జారీ చేశామన్నారు. ప్రమాదం ఎలా జరిగిందన్న అంశంపై దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. అగ్నిప్రమాదం జరిగిన భవనానికి ఎంట్రీ అండ్ ఎగ్జిట్ పాయింట్లు ఒకే వైపు ఉన్నాయన్నారు. బిల్డింగ్‌కు ఫైర్ సేఫ్టీ నిబంధనలు లేవని తెలిపారు. హర్ష మెస్ వల్ల అగ్ని ప్రమాదం జరిగిందని బాధితులు చెప్తున్నారని.. ప్రమాదానికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడవుతాయని రంగనాథ్ పేర్కొన్నారు.

# పాలన చేతకాకపోతే రాజీనామా చేయాలి: ఎంపీ ధర్మపురి అరవింద్

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్.. సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి రాజకీయాలు చేయడం తగదని అరవింద్ వ్యాఖ్యానించారు.

### కేంద్రంపై నెపం సరికాదు

వరి కోతలు ప్రారంభమయ్యే ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో విఫలమై కేంద్రంపై నెపం మోపడం సరికాదని విమర్శించారు. దొంగ ఇసుక, మొరం రవాణా కోసం ట్రాక్టర్లు, లారీలు అందుబాటులో ఉంటే, రైతుల ధాన్యాన్ని తరలించేందుకు మాత్రం కొరత వస్తుందా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐకి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ధాన్యాన్ని ఇళ్ల ముందు కుమ్మరిస్తామనడం రైతులను అవమానించడమేనని అన్నారు.

### రాజీనామా చేయాలి

రాష్ట్రంలో ఎంత పంట ఉత్పత్తి అవుతుందో ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించకుండా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని అరవింద్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలన చేతకాకపోతే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపైనా విమర్శలు చేసిన ఆయన, ప్రస్తుతం ఉన్న నగర సమస్యలను పరిష్కరించకుండా కొత్త నగరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. నిరుద్యోగ భృతి, గ్రామీణ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలకు అనుకూలంగా ముఖ్యమంత్రి ఇప్పటివరకు కేంద్రం ముందు బలమైన వాదన వినిపించలేదని అరవింద్ విమర్శించారు. కాంగ్రెస్ నాయకత్వం, రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై పలు ప్రశ్నలు లేవనెత్తుతూ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# భవిష్యత్తులో వర్షాలు వచ్చే పరిస్థితి లేదు.. నీటిని ఆదా చేయండి: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కృష్ణకాంత్ పార్క్‌లో హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా 12 రోజుల పాటు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంతో నాకు సంబంధం లేదని ఎవ్వరూ అనుకోవద్దని తెలిపారు. అశోక చక్రవర్తి ఆనాడు మొక్కలు నాటారని.. ఈరోజు కూడా అది జ్ఞాపకం చేసుకుంటామని అన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని కోరారు. ఢిల్లీ కాలుష్యపు కోరల్లో చిక్కుకుందని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి రావొద్దని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. జుఎ వాహనాల వాడకం వల్ల పొల్యూషన్‌ను తగ్గించి పర్యావరణాన్ని కాపాడొచ్చన్నారు. భవిష్యత్తులో వర్షాలు రాకుండా ఉండే పరిస్థితి ఏర్పడుతుందని.. అందరూ నీటిని ఆదా చేయాలని సూచించారు. బోర్లు వేస్తే నీరు వచ్చే పరిస్థితులు లేవన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి ఇంట్లో మొక్కలు నాటుకోవాలని కోరారు. ప్లాస్టిక్‌ను నియంత్రించాలని అన్నారు. భూమిలో కలిసి పోయే వ్యర్థాలను వాడితే మంచిదని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలా, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

న్యూస్ వార్ వార్తా పత్రిక

**సంపాదకీయం...**

# పుష్కర కాలంలో కోరింది దొరికిందా?

'పల్లకీలోకి వర్మగారొచ్చినా, శర్మగారొచ్చినా.. మోసే వాడికి బరువులో తేడాలేద'ని ఎక్కడో రాస్తారు రాచకొండ విశ్వనాథశాస్త్రి (రావిశాస్త్రి). బలమైన ఆశలు – ఆకాంక్షలతో దశాబ్దాల పోరాటం, దద్దరిల్లిన ఉద్య మాల తర్వాత తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాకారమై పుష్కరకాలం ముగిసింది. రాష్ట్రం 'తెచ్చిన' వారు తొలుత తొమ్మిదిన్నరేళ్లు పాలిస్తే, వారిని కాదని ప్రజా మద్దతుతో అధికారంలోకి వచ్చామంటున్న రాష్ట్రం 'ఇచ్చిన'వారి ఏలుబడి మొదలై అప్పుడే రెండున్నరేళ్లు! మొత్తంగా పుష్కరకాలం గడిచాక.. తెలంగాణ రాష్ట్రం లక్ష్యసాధన మార్గంలోనే ఉందా? ఉమ్మడి రాష్ట్రంలో ఊపిరాడని స్థితినుంచి సొంత రాష్ట్ర భావన మొగ్గతొడి గి, పూతోటై విరాజిల్లుతున్న తెలంగాణలో సర్వజనుల ఆశలు నెరవేరుతున్నాయా? ప్రత్యేక రాష్ట్రంలో పాత దోపిడీ వ్యవస్థ పోయి ఆశించిన రీతిలో పాలన సాగు తోందా? ఉద్యమాలకు ఊపిరిలూదిన నినాదం 'నీళ్లు– నిధులు –నియామకాలు' నిజమై, వాటి ఫలాలు పౌరులకందుతున్నాయా? సబ్బండ వర్ణాల సగటు జీవితాలు బాగుపడ్డాయా? ఇప్పుడివన్నీ జవాబు రావాల్సిన ప్రశ్నలే! ఎందుకంటే, కాలచక్రంలో పన్నెండేళ్లు పరిగణించదగ్గ సముచిత సమయమే! మరి, ఫలాలు సమంజసంగా ఉన్నాయా? రాష్ట్రం ఏర్పడి పన్నెండేళ్లయింది. ఏం సాధించాం? అని బేరీజు వేసుకోవాల్సిన సమయం. దేశ స్వాతంత్ర్యానంతర కాలంలో మొదట్నుంచి కొనసాగుతున్న పలు ఇతర రాష్ట్రాల కన్నా తెలంగాణది భిన్న చరిత్ర! దాదాపు ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానం. నిజాం నిరంకుశ పాలననుంచి ఏడాది ఆలస్యంగా స్వాతంత్ర్యం పొంది, ఒకసారి ఇతరులతో కలిసి విశాలాంధ్రగా ఏర్పడి, ఇంకోసారి విడిపోయి ప్రత్యేక రాష్ట్ర హోదా పొందిన 'తెలంగాణ' ఇవాళ ఏ విధంగా ఉంది? సగటు మనిషి జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయా? అని ప్రశ్నించుకోవాలి. ప్రత్యేక రాష్ట్రం ఎందుకు కోరారు? పోరాడి సాధించుకున్నాక సదరు కోరిక నెరవేరుతోందా? అన్నది అన్నింటికన్నా మౌలిక ప్రశ్న. దీనికి, పాలకులతో పాటు ఉద్యమకారులు, బుద్ధిజీవులు, ఇతర సామాజికవేత్తలు సమాధానం చెప్పాలి. ఆ క్రమంలో పరిణామాలను సమీక్షించుకోవాలనే అంశం చర్చకు వస్తోంది. ప్రజా తెలంగాణ, ప్రజాస్వామిక తెలంగాణ.. ఇలా ఎన్నెన్నో భావనలు పరివ్యాప్తమైన మీదట కూడా భౌగోళిక తెలంగాణయే తప్ప సామాజిక తెలంగాణ ఇంకా ఏర్పడనే లేదన్న అసంతృప్తి కలుగుతోంది. సమ్మిళిత వృద్ధి జరుగకపోవడమే అందుకు కారణం. అంకెలెప్పుడూ అర్థ సత్యాలేనని విమర్శకులంటారు. 'అభివృద్ధి' అనేది ఒకే అర్థంలో కనబడని బ్రహ్మ పదార్థం. ఎవరి అభివృద్ధి..? అనే ప్రశ్న జనిస్తుంది. కొత్తగా ఏర్పడ్డ చిన్న రాష్ట్రం అయినా అనేక విషయాల్లో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నెలబెట్టామని కిందటి ప్రభుత్వ పెద్దలు చెప్పేవారు. రాష్ట్రం ఏర్పడ్డ వెంటనే జరిగిన ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్) విజయం సాధించి ప్రభుత్వం ఏర్పరచడం, 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లో మళ్లీ గెలిచి మొత్తంగా దాదాపు తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో ఉండటం అందరికీ తెలిసిందే! సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్ ఉత్పత్తి, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇచ్చామని వారు చెప్పేది. ప్రత్యర్థి పక్షాలు మాత్రం పదేళ్ల పాలనలో ఆర్థిక క్రమశిక్షణ లోపించిందని, రూ. 8 లక్షల కోట్ల రుణాలతో రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశారని, రాష్ట్ర సాధన ఉద్యమకారుల్ని నిర్లక్ష్యం చేశారని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా యువతను తీవ్ర అసంతృప్తికి గురిచేశారని విమర్శించాయి. 2023 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. నీళ్లు, నిధులు, నియామకాలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అవి అలాగే ఉన్నాయని ప్రస్తుత విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఎన్నికల ముందు ప్రజలను నమ్మించి చెప్పిన 'ఆరు గ్యారెంటీల అమలు' కూడా అంతంతే అని ప్రత్యర్థి బిఆర్ఎస్, బిజెపిలు విమర్శిస్తున్నాయి. కలుపుకొని ఏర్పడ్డ తెలంగాణ ఆరంభంలో ఆర్థికంగా మిగులు రాష్ట్రం. కానీ, ఇప్పుడు రోజు గడవడం కష్టం! రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అయిన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క జిల్లాల వారీగా ప్రజాప్రతినిధుల భేటీల్లో చెబుతున్న దాన్నిబట్టి పరిస్థితి ఎంతో దయనీయంగా ఉంది. సగటున ప్రతినెలా 17, 18 వేల కోట్ల రూపాయల రాబడి వుంటే నెలవారీ వ్యయం 19 నుండి 20 వేల కోట్ల రూపాయల దాకా ఉంటోంది. సగటున నెల్నెలా రూ. 2,200 కోట్ల లోటు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంతకు ముందు స్వయంగా వెల్లడించినట్టు మూడో వంతు రాబడి అప్పుల కిస్తీలు, వడ్డీలకు వెళుతుంటే మరో మూడో వంతు రాబడిని సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు వ్యయం చేస్తున్నారు. ఇక అభివృద్ధి కార్యక్రమాలు ఎలా చేపట్టాలి..? ఏవి నిధులు..? అనే ప్రశ్న సహజమే. ఈ పరిస్థితుల్లో 2026 –27 బడ్జెట్ రూ. 3.25 లక్షల కోట్లతో సభ ఆమోదం పొంది ఏమిటి ప్రయోజనం..? కేంద్రంలోని బిజెపి నేతృత్వపు ఎన్‌డిఎ ప్రభుత్వం పూర్తి సహాయ నిరాకరణ చేస్తోందని, రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన వాటా కూడా ఇవ్వటం లేదని పాలకపక్షం కాంగ్రెస్ విమర్శిస్తోంది. కేంద్రం నుంచి రావాల్సిన వివిధ ప్రాజెక్టులు, కార్యక్రమాల నిధులు తెచ్చుకోవడంలో రాష్ట్ర అధికార యంత్రాంగం సమర్థంగా, చొరవతో పనిచేయడం లేదనే విమర్శ కూడా ఉంది. ప్రభుత్వ భూముల్ని తెగనమ్మి పన్నేతర ఆదాయాలను సర్కారు సమకూర్చుకుంటోంది. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర పాలకుల వల్లే నిధుల్లో అన్యాయం అనినా సొంత రాష్ట్రంలోనూ ఈ దుస్థితి ఎందుకన్నది ప్రశ్న!-ాశ్రీంశీ =ముఠ – మళ్లీ టారిఫ్‌లతో 'ట్రంపరి'తనం నీళ్లతో నిత్య జగడాలే! ప్రపంచంలో ఎక్కడా లేని రీతిలో ఎత్తిపోతల రికార్డు సృష్టించి కాళేశ్వరంతో తెలంగాణ జీవనరేఖ దిద్దామని గత ప్రభుత్వం చెప్పుకుంది. అదొక పెద్ద అవినీతి ప్రాజెక్టు అని, లక్ష కోట్ల రూపాయ్లు దుబారా చేసి మునిగిపోయిన ప్రాజెక్టుతో వేల కోట్లు దండుకున్నారని కాంగ్రెస్ అభియోగాలు మోపింది. అధికారంలోకి రాగానే శ్వేత పత్రాల వెల్లడితోపాటు విచారణ జరిపించింది. అందులో అంతిమంగా తేలిందేమీ లేదు. ప్రాజెక్టుకు రిపేర్లు లేవు. సాగు ఆయకట్టు పెరిగిందేమీ లేదు. గోదావరి, కృష్ణా నదీ జలాల విషయంలో ఎపి, తెలంగాణ మధ్య అంతర్రాష్ట్ర జలవివాదాలు పరిష్కారం లేక ఎక్కడ వేసిన గొంగడి అక్కడే చందంగా తయారయింది. ఎపి తలపెట్టిన బనకచర్ల రెండు రాష్ట్రాల మధ్య ఉద్రిక్తతలు రేపింది. మధ్యలో 'పెన్నా'ను ఉంచి కృష్ణా– కావేరి నదుల అనుసంధానం చేస్తామని, కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తమకు సహకరిస్తుందని ఎపి సీఎం చంద్రబాబు చెబుతున్నారు. కొత్త ట్రిబ్యునల్ ఏర్పడి కృష్ణా జిల్లాల్లో వాటాల పునఃపంపిణీ జరగాలని, 66:34 నిష్పత్తి తమకు ఆమోదయోగ్యం కాదని తెలంగాణ వాదిస్తోంది. 70:30 లేదా కనీసం 50:50 నిష్పత్తిలో వాటాల పంపిణీ జరగాలన్నది తెలంగాణ డిమాండ్. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ పదవీ కాలాన్ని 2027 జులై మాసాంతం వరకు పొడిగించారు. కృష్ణాల్లో రెండు రాష్ట్రాల డిమాండ్ అధికం కాగా నీటి లభ్యత పరిమితంగా ఉంది. గోదావరిలో నీటి లభ్యత అధికంగా ఉన్నా ప్రాజెక్టులు సవ్యంగా లేవు. పర్యావరణ వేత్తలు కోరుతున్నట్టు అధికారాలు, స్వయం ప్రతిపత్తి కలిగిన రివర్ వ్యాలీ అథారిటీలు ఏర్పాటు కానంతవరకు జలజగడాలు తప్పవేమో? నియామకాలూ అంతంతే! మూడో ముఖ్య నినాదమైన ఉద్యోగ నియామకాలు, ఉపాధి కల్పనలోనూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించిన ప్రగతి అంతంత మాత్రమే! అందుకే, యువత తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ప్రత్యక్షంగా లక్షన్నర ఉద్యోగాలు కల్పించి, మరెంతో మందికి అవుట్ సోర్సింగ్‌లో, ప్రయివేటులో ఉద్యోగ–, ఉపాధి అవకాశాలు కల్పించామని గత ప్రభుత్వం చెప్పింది. తమను విమర్శించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తాము ఇచ్చిన నోటిఫికేషన్లు, నియామక ప్రక్రియ ముగింపు దశలో ఉన్న వాటికి సంబంధించి ఆర్భాటంగా నియామక పత్రాలు అదించడం తప్ప ప్రత్యేకంగా చేసిందేమీ లేదని బిఆర్ఎస్ విమర్శిస్తోంది. జాబ్ క్యాలెండర్ అన్నారు. అదీ లేదు, కొత్త నోటిఫికేషన్లు లేవు. నిరుద్యోగ భృతి అన్నారు. అతీగతీ లేదన్నది వారి ఆరోపణ. అసలు రాష్ట్రంలో ఎందరు మొత్తం ఉద్యోగులున్నారు? అవుట్ సోర్సింగ్ ఉద్యోగులెందరు అనే వాటిపై సరైన డేటా లేదు. కొన్ని చోట్ల ఒకే పనిని ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది చేస్తూ ఖజానాకు రెండు జీతాల భారం మోపుతున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై అధ్యయనం సరిగ్గా జరగటం లేదు. ఉద్యోగుల జీతభత్యాలు–, ఆఫీసుల నిర్వహణకు ఇప్పటికే ప్రతి నెలా రూ. ఆరు వేల కోట్ల ఖర్చవుతోందని, ప్రస్తుత హడావుడి ఉద్యోగ నోటిఫికేషన్ల ప్రక్రియ ముగిసి, నియామకాలు జరిగితే సదరు వ్యయం రూ. పది వేల కోట్లకు చేరవచ్చని ఒక అంచనా! విభజన హామీల అమలు దిక్కూ–మొక్కూ లేదు. రూ. 1.42 లక్షల కోట్ల విలువ చేసే (9, 10 షెడ్యూల్ కింద) 142 పబ్లిక్ సంస్థల విభజన జరుగనే లేదు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పలుమార్లు పురమాయించినా రెండు ప్రభుత్వాలు చొరవ చూపక వాటి విభజన, ఆస్తుల పంపకం జరుపుకోలేదు. ఫలితంగా తగు నిఘా, నిర్వహణ, నియంత్రణ, సమీక్షలు లేక ఫలితాలు రావట్లేదు. రావాల్సిన విద్యుత్ బకాయిలు ఇంకా ఎపి ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వానికి చెల్లించనేలేదు.

# జూన్ 4న కేరళలోకి నైరుతి రుతుపవనాలు

## దేశవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే ఛాన్స్ దక్షిణాది రాష్ట్రాల్లో విస్తృతంగా వర్షాలు

**న్యూఢిల్లీ,**

దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు స్వల్ప ఆలస్యంతో కేరళలోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతున్నాయి. భారత వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం జూన్ 4న కేరళ తీరాన్ని రుతుపవనాలు తాకే అవకాశం ఉంది. దీంతో దేశంలో అధికారికంగా వర్షాకాలం ప్రారంభం కానుంది. రుతుపవనాల రాకతో దక్షిణ భారత రాష్ట్రాల్లో వచ్చే ఆరు నుంచి ఏడు రోజుల పాటు విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా కేరళలో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 7 సెంటీమీటర్ల నుంచి 20 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. అరేబియా సముద్రం మీదుగా తేమతో కూడిన గాలులు బలపడుతుండటంతో రుతుపవనాల కదలిక వేగవంతమవుతోంది. దీని ప్రభావంతో కేరళతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే





అవకాశముందని హెచ్చరించింది. అయితే రుతుపవనాల ప్రారంభంతో పాటు పలు ప్రాంతాల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితులు కూడా ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దేశంలోని వాయువ్య, మధ్య, తూర్పు ప్రాంతాలతో పాటు దక్షిణ ద్వీపకల్ప ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురుగాలుల వేగం గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని అంచనా వేసింది. దీంతో విద్యుత్ స్తంభాలు, తాత్కాలిక నిర్మాణాలు, వ్యవసాయ పంటలకు నష్టం కలిగే అవకాశం ఉందని పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, స్థానిక అధికారుల సూచనలు పాటించాలని సూచించింది. ఉత్తరాదిలోని ఢిల్లీ– ఎన్‌సీఆర్, రాజస్థాన్, పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో ఇటీవల నమోదైన తీవ్ర ఎండల నుంచి ఉపశమనం కొనసాగనుంది. ఆ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. గత కొన్ని రోజులుగా అక్కడ గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టినట్లు తెలిపింది. అదేవిధంగా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి మధ్య భారత రాష్ట్రాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. తూర్పు భారతదేశంలోని బిహార్, ఝార్ఖండ్, బంగాల్?లో రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా, తొలుత మే 26నే నైరుతి రుతుపవనాలు కేరళను తాకవచ్చునని ఐఎండీ అంచనా వేసింది. అయితే, ఆ అంచనాలను మే 29న సవరించి, తదుపరి వారంలో రావచ్చునని పేర్కొంది. మరోవైపు, వాతావరణంలో ఏర్పడిన ఎల్? నినో పరిస్థితుల వల్ల ఈసారి సాధారణం కంటే తక్కువ వర్షాలే కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. పసిఫిక్? మహా సముద్ర ప్రాంతంలో ఎల్ నినో పరిస్థితులు ఏర్పడుతున్నాయని, జూన్?లో అవి బలహీనంగా ఉన్నా సెప్టెంబర్?లో బలపడే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు, తీవ్రమైన ఎండల ప్రభావంతో దేశం వేడెక్కిపోతోంది. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రతకు బయటకు రావడానికి జనం బెంబేలెత్తిపోతున్నారు. అయితే, ఎండలతో అల్లాడిపోతున్న ప్రజానీకానికి మరికొన్ని రోజులపాటు నిరీక్షణ తప్పేలా లేదని వాతావరణ శాఖ చెబుతోంది. మరోవైపు, రెండుమూడు రోజుల తర్వాతైనా రుతుపవనాలు కేరళకు వస్తాయా అని కొందరు నిపుణులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఇక, రుతుపవనాల రాకతో వాతావరణ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కేరళలోని పలు ప్రాంతాల్లో ఆరెంజ్?, ఎల్లో అలర్ట్? జారీ చేశారు. మొత్తం 9 జిల్లాల్లో ఎల్లో అలర్ట్? జారీ చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.

# రెండోరోజూ అమరావతిలో నారాయణ పర్యటన

## వాగుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

## వర్షాకాలం నీటి జాగ్రత్తలపై మంత్రి సూచనలు

**అమరావతి,**

వర్షాకాలం దృష్ట్యా రాజధాని అమరావతిలో వాగుల అభివృద్ధి పనులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. వాగుల అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. పురపాలక శాఖ మంత్రి పి నారాయణ రెండోరోజు గురువారం రాజధాని అమరావతిలో పర్యటించారు. కొండవీటి వాగు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎన్–9,8,7రోడ్లలో కొండవీటి వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జిల పనుల పురోగతిపై ఆరా తీశారు. బ్రిడ్జిల కింద కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకం లేకుండా మట్టి తొలగించాలని అధికారులను ఆదేశించారు. కొండవీటి వాగు వెడల్పు తక్కువగా ఉన్నచోట మరింత వెడల్పు చేయాలని సూచించారు. నీరుకొండలో నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను కూడా మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాజధానిలో ట్రంక్ రోడ్లు, బ్రిడ్జిలు, వాగుల అభివృద్ధి పనులు వేగంగా జరుగు తున్నాయని మంత్రి చెప్పారు. ట్రంక్ రోడ్లపై 43,ఎల్ పి ఎస్ (ల్యాండ్ పూలింగ్)జోన్లలో 32 బ్రిడ్జిలను నిర్మిస్తున్నామని మంత్రి చెప్పారు. వర్షాకాలంలో కొండవీటివాగు ప్రవాహానికి ఇబ్బంది లేకుండా మట్టి తొలగింపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. శాఖమూరు, పెనుమాక, నీరుకొండ రిజర్వాయర్లలో సగం పని పూర్తయిందని చెప్పారు. కొండవీటివాగు 23.7 కిలోమీటర్లు, పాలవాగు 16.7 కిలోమీటర్లు, గ్రేవిటీ కాలువ 7.84 కిలోమీటర్లు అభివృద్ధి



చేస్తున్నామని మంత్రి చెప్పారు. నీరుకొండ రిజర్వాయర్ 440 ఎకరాలలో నిర్మాణం జరుగుతోందని అన్నారు. వైసిపి నాయకులు రైతుల ను రెచ్చగొడుతున్నారని, విభేదాలు సృష్టించి రాజధానిని విధ్వంసం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. అమరావతిపై వైసిపి కమిటీలు వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతుల భూములను వెనక్కి ఇచ్చేస్తామని వైసిపి నాయకులు చెబుతున్నారని, భవనాలు, రోడ్లు, పైపు లైన్లు ల నిర్మాణం పూర్తయ్యాక సిఎంగా పనిచేసిన వ్యక్తి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి అన్నారు. రాజధాని పర్యటనలో మంత్రి వెంట అమరావతి అభివృద్ధి సంస్థ (ఎడిసి) ఛైర్ పర్సన్ డి లక్ష్మీ పార్థసారధి, సి ఆర్ డి ఎ,ఎడిసి చీఫ్ ఇంజినీర్లు ఇతర అధికారులు ఉన్నారు.

# విశాఖ వేదికగా జూలైలో ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ మహాసభలు

## పోస్టర్ ఆవిష్కరించిన విద్యార్థి నాయకులు

**విశాఖపట్టణం**

: భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జాతీయ సమావేశాలు జూలై 13,14,15 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, అధ్యక్షులు రామ్మోహన్ తెలిపారు. గురువారం జగదాంబ సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ సమావేశాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ సమావేశాలకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని చెప్పారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన నీట్ పరీక్ష నిర్వహణలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడంతో, పరీక్షను రద్దు చేశారని, దీంతో ఈ పరీక్షకు హాజరైన 23 లక్షల మంది అభ్యర్థులు తీవ్రమైన ఆత్మ క్షోభకు గురయ్యారని చెప్పారు. అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. కేవలం నీట్ పరీక్షలు మాత్రమే కాకుండా యుజిసి పరీక్షలు, ఆఖరికి సిబిఎస్ఎస్సి పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి ఉందన్నారు. సిబిఎస్సి పరీక్ష నిర్వహణలో విఫలం చెందిన సి బి ఎస్ సి కార్యదర్శిని తొలగించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన జాతీయ విద్యా విధానాన్ని ఎస్ఎఫ్ఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాలకు అవసరమైన పాఠ్య పుస్తకాలను కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానం ప్రకారం రూపొందించి పంపిస్తుందని చెప్పారు. వాటి పుస్తకాలలో మతాన్ని బోధించే విధంగా వీటి రూపకల్పన ఉందన్నారు. విద్యను కేంద్రీకరించడం సరికాదన్నారు. విద్య వికేంద్రీకరణ జరగాలన్నారు. కేంద్ర ప్రభుత్వం, అలాగే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రైవేటు విద్యను ప్రోత్సహిస్తూ, ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. వేసవి రోజులలో కూడా రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థలు పాఠశాలలను నిర్వహించాయని, వాటిపై ఎటువంటి చర్య లేదన్నారు. ఎస్ ఎస్ సి లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నతంగా రాణించారని గొప్పలు చెప్పిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అడ్డగోలుగా ప్రైవేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించడంతో, ఈ ఏడాది లక్ష మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు దూరమైనట్టు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీలలో అధ్యాపకుల పోస్టులు 5 వేలు ఖాళీలు ఉన్నాయన్నారు. గీతం వంటి ప్రైవేటు విద్యాసంస్థను అధికార పార్టీ వారే నడుపుతూ, ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకురావాలని కోరుతూ, విద్యను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందన్నారు. ఇందుకోసం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.సాయి తేజ, ప్రధాన కార్యదర్శి జి. అజయ్ తదితరులు పాల్గొన్నారు.



న్యూస్ వార్
వార్తా పత్రిక

## పాలమూరు గడ్డ సాక్షిగా రేవంత్ పచ్చి అబద్ధాలు : మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

రాష్ట్రంలోని నీటి పారుదల ప్రాజెక్టులపై ఎలాంటి అవగాహన లేని సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు గడ్డ సాక్షిగా పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆరోపించారు.ఒక టీఎంసీకి 15 వేల ఎకరాల పంట సాగు అని కేంద్ర జలసంఘం సమావేశాల్లో చెప్పడం వల్ల పరువు పోవడమే కాకుండా, టీఎంసీకి 15 వేల ఎకరాలు లెక్కగట్టి కేటాయిస్తే తెలంగాణ శాశ్వతంగా నీటి హక్కులు కోల్పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి అబద్దాల లెక్కలు నమ్ముకుంటే రాష్ట్ర రైతాంగం డ్రిప్పులు, స్ప్రింకర్ల మీదనే ఆధారపడాల్సి వస్తుందని పేర్కొన్నారు.ప్రాజెక్టులను పూర్తి చేసిన ఘటన కేసీఆర్‌దే అని అన్నారు.కేసీఆర్ హయాంలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.35,200 కోట్ల పనులు చేసింది నిజం కాదా ? ఈ ఎత్తిపోతలకు వ్యతిరేకంగా వందల కేసులు వేసింది కాంగ్రెస్ పార్టీ కాదా ? అంటు ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కాల్వల టెండర్లు రద్దు చేయడం వల్ల ఇప్పుడు రూ.4 వేల కోట్ల భారం పెరిగిందని విమర్శించారు. దశాబ్దాల పాటు కాంగ్రెస్ హయాంలో పెండింగ్ లో పెట్టిన ప్రాజెక్టులను పూర్తి చేసింది కేసీఆర్ అని గుర్తు చేశారు. ఎత్తిపోతల పథకాల్లో మొదట చేయాల్సింది పంపులు, లిఫ్టు పనులేనని వెల్లడించారు. 2006లో కాంగ్రెస్ వదిలేసిన కేఎల్ఐ ఎత్తిపోతల పనులను 2016 లో బీఆర్ఎస్ పూర్తి చేసిందని వివరించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కోసం 27,100 ఎకరాల భూసేకరణకు గాను 26,800 ఎకరాలు కేసీఆర్ హయాంలోనే సేకరించారని తెలిపారు. భూసేకరణలో మిగిలింది 300 ఎకరాలు కాగా భూసేకరణ అసలే చేయలేదని ఆరోపించడం సిగ్గుచేటని అన్నారు.

**అబద్ధానికి అంగీ, లాగు వేస్తే..**

పాలమూరు బిడ్డను అని చెప్పుకునే ముఖ్యమంత్రి 30 నెలల్లో ఏ ప్రాజెక్టులు పూర్తి చేశారని, తాము ఏ ప్రాజెక్టులను అడ్డుకున్నామని నిలదీశారు. అబద్ధానికి అంగీ, లాగు వేస్తే అది రేవంత్ రెడ్డిని విమర్శించారు. మహబూబ్ నగర్ జిల్లాలో రెండు రోజుల పర్యటన జరిపి అబద్దాలు వల్లించడం ఎందుకని ప్రశ్నించారు. హైదరాబాద్ లోనే ఇదే స్క్రిప్టు చదివితే ప్రజలకు కొంచెం భారమైనా తగ్గేదని అన్నారు.

## తెలంగాణ ప్రజలకు పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి : చాడ వెంకట్ రెడ్డి



తెలంగాణ రాష్ట్ర విభజన తీరును వక్రీకరిస్తూ మాట్లాడిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని సిపిఐ రాష్ట్ర నాయకులు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి సిపిఐ రాజకీయ శిక్షణ తరగతులు వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్ లో శుక్రవారం ప్రారంభించగా ఆయన హాజరై మాట్లాడారు.12 సంవత్సరాల క్రితం ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర విభజనను మరోసారి వక్రీకరించి మాట్లాడడం సరికాదని అన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల జాగిరే తెలంగాణ రాష్ట్రమని పవన్ కళ్యాణ్ తెలుసుకోవాలని ఎద్దేవా చేశారు.ఆవేశానికి కేరాఫ్ గా నిలిచిన పవన్ కళ్యాణ్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు లాంటి మేధావుల పై ఆంధ్రప్రదేశ్ లో కేసులు నమోదు చేయడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. రెండు రాష్ట్రాల ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని అన్నారు. ఎన్డీఏ కూటమి కూడా తెలంగాణలో అడుగుపెట్టేందుకు చూస్తుందని ఇందులో భాగంగానే పవన్ కళ్యాణ్ మాట్లాడిన మాటలు అర్థం చేసుకోవచ్చు అని కూడా అన్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజల పట్ల చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని బేశరత్తుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. నరేంద్ర మోదీ పాలనలో సామాజిక న్యాయం పూర్తిగా కొరబడిందని మండిపడ్డారు. ఎన్నికలు వచ్చిన ప్రతి సందర్భంలో ఎట్లా గెలవాలనే దానిపైన దృష్టి ఉంది కానీ రాజ్యాంగంలోని ప్రజలకు కావాల్సిన కూడు, గూడు, నీడ, విద్య, వైద్యం విధానంలో ప్రభుత్వం పనిచేయడం లేదని విమర్శించారు. దేశంలోని సంపద నలుగురు దగ్గరే మూలుగుతోందని ఆరోపించారు. ఈ సమావేశంలో రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపెల్లి జిల్లాల సిపిఐ జిల్లా కార్యదర్శులు సుదర్శన్, శ్రీనివాస్, సదానందం, విశ్వనాథం, రాష్ట్ర నాయకులు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్, శంకర్, నాయకుల ఉన్నారు.

## టీఎస్ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా సునీతా గోపాల్‌దాస్ నియామకం

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ)లో త్వరలో జరగబోయే కార్మిక సంఘం (ట్రేడ్ యూనియన్) ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారిగా హైదరాబాద్ ట్విన్ సిటీస్ జాయింట్ లేబర్ కమిషనర్ సునీతా గోపాల్‌దాస్‌ను కార్మిక శాఖ నియమించింది. ప్రభుత్వ రంగ సంస్థలలో కార్మిక సంఘాల గుర్తింపునకు సంబంధించిన నిర్దేశిత విధానాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా, టీఎస్ఆర్టీసీ ఉద్యోగుల ప్రతినిధి సంఘాన్ని నిర్ణయించడానికి ఈ ఎన్నికలను నిర్వహిస్తున్నారు.ఈ ఎన్నికల ప్రక్రియ అంతా అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా రిటర్నింగ్ అధికారి పర్యవేక్షిస్తారు.రిటర్నింగ్ అధికారిగా సునీతా గోపాల్‌దాస్ నామినేషన్ల పరిశీలన, అర్హులైన ఓటర్ల జాబితా ప్రచురణ, పోలింగ్ ఏర్పాట్లు, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన మరియు ఎన్నికలకు సంబంధించిన సమస్యల పరిష్కారం వంటి అన్ని ఎన్నికల కార్యకలాపాలను నిబంధనల ప్రకారం నిర్వహిస్తారు.ఎన్నికలను సుషీలంగా జరపడానికి కార్మిక శాఖ ఇప్పటికే టీఎస్ఆర్టీసీ యాజమాన్యం మరియు వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లను ప్రారంభించింది. వివరణాత్మక ఎన్నికల షెడ్యూల్, పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల అర్హత ప్రమాణాలు మరియు ఇతర ప్రక్రియల వివరాలను రిటర్నింగ్ అధికారి విడిగా నోటిఫై చేయనున్నారు. టీఎస్ఆర్టీసీ ఉద్యోగులు తమ సంక్షేమం మరియు హక్కుల సాధన కోసం తమ ప్రతినిధి సంఘాన్ని ఎన్నుకునేందుకు ఈ గుర్తింపు ఎన్నికలు ఒక ముఖ్యమైన ప్రజాస్వామ్య ప్రక్రియ అని అధికారులు పేర్కొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## పర్యావరణ దినోత్సవంలో చండూరు మున్సిపల్ చైర్మెన్ డా. కోడి శ్రీనివాసులు



**చండూరు మే 5 (న్యూస్ వార్ )**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న పర్యావరణ వారోత్సవాలు సందర్భంగా, ఈ రోజు (జూన్ 5) ప్రపంచ పర్యావరణ దినోత్సవంను పురస్కరించుకొని చండూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం, కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొని నేతాజీ పార్క్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని, అలాగే ప్రతి వ్యక్తి తనకు ఇష్టమైన ప్రత్యేక రోజును ఎంపిక చేసుకొని ఆ రోజున ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని చండూరు పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం మాట్లాడుతూ, చెట్లు మానవ జీవితానికి ఎంతో అవసరమని తెలిపారు. చెట్లు ప్రాణవాయువును అందించడంతో పాటు వాయు కాలుష్యాన్ని తగ్గిస్తాయని, భూగర్భ జలాల సంరక్షణకు దోహదపడతాయని, ఉష్ణోగ్రతలను నియంత్రించి పర్యావరణ సమతుల్యతను కాపాడుతాయని పేర్కొన్నారు. వర్షపాతం పెరగడానికి, జీవ వైవిధ్య పరిరక్షణకు చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. భావితరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ భూతరాజు దశరథ , కౌన్సిల్ సభ్యులు బుషిపాక వాసు, జెల్ల ధనమ్మశ్రీనివాస్, కొన్రెడ్డి మధు, కోడిసుష్మవెంకన్న, కటకం రమేష్, కో-ఆప్షన్ సభ్యులు గౌరవ కల్లెట్ల చంద్రకళమారయ్య, షేక్ ఖలీల్, వార్డ్ ఆఫీసర్స్ ఎ. జగన్, బి. సాయిరాం, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ యమ్. అరవింద్ రెడ్డి, బిల్ కలెక్టర్స్ మరియు కంప్యూటర్ ఆపరేటర్ అంజి మొదలైన వారు పాల్గొన్నారు.

# హైటెక్స్‌లో 'థ్రెడ్ పోచంపల్లి' ప్రదర్శన ఘనంగా ప్రారంభం

## ఆకట్టుకుంటున్న ఇకత్ వస్త్రాలు




తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన పోచంపల్లి ఇకత్ కళా వైభవాన్ని ప్రపంచానికి చాటిచేప్పే లక్ష్యంతో హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్, హాల్-4లో ఏర్పాటు చేసిన "థ్రెడ్ పోచంపల్లి" ప్రదర్శన శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. యాదాద్రి భువనగిరి జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక ప్రదర్శనను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత ఉ జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు ఉ భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, చేనేత కళాకారులు, పరిశ్రమ ప్రతినిధులు మరియు చేనేత ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ జానపద కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రారంభమైన ఈ వేడుక సందర్శకులను విశేషంగా ఆకట్టుకోగా, ప్రత్యేకంగా రూపొందించిన ప్రవేశ మండపంలో ఏర్పాటు చేసిన సంప్రదాయ మగ్గాల ప్రదర్శన, పద్మశ్రీ పురస్కార గ్రహీతలు రూపొందించిన అద్భుత హస్తకళాఖండాలు, సహజ రంగులు మరియు వాటి తయారీకి ఉపయోగించే పదార్థాల ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.ఈ ప్రదర్శనలో సరికొత్త సాంకేతికతతో ఏర్పాటు చేసిన ఆధునిక ఏఐ (కృత్రిమ మేధస్సు) ఎక్స్‌పీరియన్స్ బూత్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది, ఇక్కడకు వచ్చే సందర్శకులు వర్చువల్‌గా పోచంపల్లి ఇకత్ దుస్తులను ధరించి ఆ సరికొత్త అనుభూతిని సొంతం చేసుకుంటున్నారు. దీనితో పాటు ఇకత్ తయారీ ప్రక్రియను దశలవారీగా వివరించే ప్రత్యేక విజువల్ గ్యాలరీని కూడా ఇక్కడ సిద్ధం చేశారు. ప్రదర్శన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 100కు పైగా స్టాళ్లలో సంప్రదాయ చీరలు, ఆధునిక ఫ్యాషన్ దుస్తులు, పురుషుల వస్త్రాలు, గృహ అలంకరణ ఉత్పత్తులు మరియు జీవనశైలి ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారు. పోచంపల్లి నేయకళ నేటి ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఎలా విస్తరిస్తోందో ఈ స్టాళ్లు ప్రతిబింబిస్తుండగా, పోచంపల్లి ప్రాంతీయ వంటకాలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆహార స్టాళ్లు సందర్శకులకు అదనపు సాంస్కృతిక అనుభూతిని పంచుతున్నాయి. తెలంగాణ టూరిజం శాఖ కూడా ఈ ప్రదర్శనలో భాగస్వామ్యమై, పోచంపల్లి గ్రామ సందర్శనకు సంబంధించిన ప్రత్యేక పర్యాటక ప్యాకేజీలను ప్రచారం చేస్తోంది, దీని ద్వారా సందర్శకులు నేరుగా నేత కార్మికుల అవసరాలు కలుసుకుని, సంప్రదాయ మగ్గాల పనితీరును స్వయంగా వీక్షించే అవకాశం లభిస్తుంది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్, సికింద్రాబాద్ మరియు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి, ఇక్కడి అసలైన చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వేలాది నేత కుటుంబాలకు ఆర్థికంగా మద్దతు అందించాలని ఆయన కోరారు. తెలంగాణ చేనేత వైభవాన్ని తెలుసుకోవడానికి, అనుభవించడానికి మరియు ప్రోత్సహించడానికి అరుదైన అవకాశంగా నిలిచిన ఈ అద్భుత "థ్రెడ్ పోచంపల్లి" ప్రదర్శన జూన్ 7, 2026 వరకు కొనసాగనుందని తెలిపారు.

## తెలంగాణ యువతకు ఉపాధి మార్గాలు చూపుతున్న 'అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు': మంత్రి డాక్టర్ జి. వివేక్



వేగంగా మారుతున్న ప్రపంచ ఉద్యోగ మార్కెట్‌కు అనుగుణంగా తెలంగాణ యువతను తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సాంప్రదాయ పారిశ్రామిక శిక్షణ సంస్థలను (ఐటీఐ) ఆధునిక 'అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు' (ఏటీసీ)గా మార్చిందని కార్మిక, ఉపాధి, గనులు మరియు భూగర్భ శాస్త్ర శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఈ కేంద్రాలు కేవలం శిక్షణ సంస్థలుగా మాత్రమే కాకుండా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు మరియు అంతర్జాతీయ కెరీర్‌లకు ప్రవేశ ద్వారాలుగా మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు.మీడియా ప్రతినిధులతో కలిసి మల్లేపల్లిలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను సందర్శించిన అనంతరం మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్శనలో భాగంగా విద్యార్థులు, శిక్షకులు అక్కడ ఉన్న అధునాతన మౌలిక సదుపాయాలు, ఆధునిక పరికరాలు మరియు సరికొత్త రంగాల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన శిక్షణా కార్యక్రమాలను ప్రదర్శించారు.రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను బలోపేతం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం 'టాటా టెక్నాలజీస్ లిమిటెడ్' (టీటీఎల్) భాగస్వామ్యంతో ఒక భారీ కార్యక్రమాన్ని చేపట్టిందని మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా దాదాపు ?4,000 కోట్ల పెట్టుబడులు సమకూరాయని, దీనివల్ల ప్రపంచ స్థాయి శిక్షణ మౌలిక సదుపాయాలు ఏర్పడి దేశీయ, అంతర్జాతీయ ఉద్యోగ మార్కెట్లలో యువతకు విస్తృత అవకాశాలు లభిస్తున్నాయని ఆయన వివరించారు. ఆర్థిక ఇబ్బందులు సాంకేతిక విద్యకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఏటీసీలలో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం స్టైపెండ్‌లను కూడా అందిస్తోందని మంత్రి తెలిపారు. సాంకేతిక రంగాల మార్పులకు అనుగుణంగా శిక్షణ సంస్థలను ఆధునీకరించడం ద్వారా భవిష్యత్తు పరిశ్రమల అవసరాలను తీర్చగల నైపుణ్యం కలిగిన మానవ వనరులు తయారవుతారని, ఇది తెలంగాణను దేశంలోనే నైపుణ్యాభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఏటీసీలను యువతకు ఒక "బంగారు అవకాశం"గా అభివర్ణించిన మంత్రి, విద్యార్థులు ఈ సదుపాయాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని, నేటి పోటీ ప్రపంచంలో విజయానికి క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర అభ్యాసం ఎంతో అవసరమని నొక్కి చెప్పారు. ఐటీఐ మౌలిక సదుపాయాల ఆధునీకరణతో పాటు విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విద్య, ఆచరణాత్మక శిక్షణ అందించేందుకు వీలుగా ఇన్స్ట్రక్టర్లు మరియు ఫ్యాకల్టీ సభ్యులకు కూడా విస్తృత శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో ఒక ప్రత్యేక ఫోటో ప్రదర్శన, సాంకేతిక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. శిక్షణ పూర్తి చేసుకుని ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు ఈ సందర్భంగా మంత్రి మరియు మీడియా ప్రతినిధులతో తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సంస్థ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌గా మారడం వల్ల తమ నైపుణ్యాలు మెరుగయ్యాయని, ఉద్యోగ అవకాశాలు మెరుగై తమ జీవితాల్లో సానుకూల మార్పులు వచ్చాయని వారు వివరించారు. యువతకు నాణ్యమైన శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో అంకితభావంతో పనిచేస్తున్న శాఖ అధికారులు, శిక్షకులు మరియు సిబ్బంది ప్రయత్నాలను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు.

Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,